విశాలాంధ్ర
శ్రీ పొట్టిశ్రీరాములు
నెల్లూరు జిల్లా

పెన్నా నది వద్ద గణేష్ నిమజ్జనం ఏర్పాట్లను పరిశీలించిన ఎమ్మెల్యే

విశాలాంధ్ర బ్యూరో -నెల్లూరు:నెల్లూరు నగరంలోని రంగనాయకు లపేట పెన్నా బ్యారేజీ వద్ద నగర శాసనసభ్యులు డాక్టర్ పి. అనీల్ కుమార్ గణేష్ నిమజ్జన ఏర్పాట్లను అధికారులతో కలిసి పరిశీ లించారు. ఆనవాయితీగా వస్తున్న గణేష్ నిమజ్జన కార్యక్రమాలు గత ఏడాది పెన్నా బ్యారేజీ పనులు జరుగుతున్న నేపథ్యంలో ఈ ప్రాంతంలో నిర్వహించలేక పోయామని, కాని ఈ ఏడాది ఈప్రాంతంలోనూ గణేష్ నిమజ్జన కార్యక్రమాలు భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచిం చామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు షేక్ అస్మ, గుంజి జయలక్ష్మి, వేలూరు మహేష్, పొట్లూరి రామకృష్ణ ఆచారి, ఓబిలి రవిచంద్ర, ఏ.పి. ఆగ్రో డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ కొణిదల సుధీర్, వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

స్పందన అర్జీదారులకు భోజన ప్యాకెట్లు పంపిణీ

విశాలాంధ్ర - కావలి: ఆర్డీవోకార్యాలయంలో సోమవారం జరిగిన స్పందన కార్యక్రమం కు విచ్చేసిన అర్జీదారులకు రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో మజ్జిగ, భోజన పొట్లాలు, మంచినీటి సీసాలు పంపిణీ చేశారు. రెడ్ క్రాస్ రక్తకేంద్రం స్ఫూర్తి ప్రదాత డాక్టర్ చిల్లకూరు లక్ష్మీనరసారెడ్డి 96వ జన్మదినం సందర్భంగా రక్తకేంద్రం సిబ్బంది ఈ కార్యక్రమానికి ఆర్థికంగా సహక రించారు. ఈ కార్యక్రమంలో గంధం ప్రసన్నంజనేయులు, మంగళగిరి వేణుగోపాలరావు పాల్గొన్నారు.

సచివాలయంను ప్రారంభించిన ఎమ్మెల్యే

విశాలాంధ్ర - కావలి : రూరల్ మండలం గౌరవరం గ్రామంలో నూతనం గా నిర్మించిన సచివాలయ భవనం, ఆర్బీకే భవనం, హెల్త్ సెంటర్ లను కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డి సోమవారం ప్రారంభించారు. గౌరవరం సర్పంచ్ దేవరపల్లి రాధిక దంపతులు ఎమ్మెల్యే కు పూలమాలలు, శాలువాలతో సత్కరించి ఘనస్వాగతం పలికారు. కావలి ఆర్డీవో శీనా నాయక్, అధికారు లు, వైసీపీ నాయకులు, సచివాలయం సిబ్బంది, వాలంటీర్లు, పాల్గొన్నారు.

బిజెపి రాష్ట్ర సంయుక్త కోశాధికారిగా కందుకూరి

- నియామకంపై కావలి వస్త్ర వ్యాపారస్తుల హర్షం

విశాలాంధ్ర - కావలి : బిజెపి రాష్ట్ర సంయుక్త కోశాధికారిగా నియమితులైన కావలి పట్టణానికి చెందిన ప్రముఖ పారిశ్రా మికవేత్త కందుకూరి వెంకట సత్యనారాయణ ని నియమించడం గర్వకారణమని కావలి పట్టణానికి చెందిన వస్త్ర వ్యాపారస్తులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కావలి పట్టణ వస్త్ర వ్యాపారస్తులు కందు కూరి వెంకట సత్యనారాయణ ని శాలువాతో సత్కరించి సన్మానం చేశారు. బిజెపి రాష్ట్ర సంయుక్త కోశాధికారిగా కందుకూరి వెంకట సత్యనారాయణ ని నియమించడం పట్ల బిజెపి రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏసీ మార్కెట్ ప్రెసిడెంట్ సత్యం, సెక్రటరీ అమర నాగేశ్వరరావు, సీవీసీ సత్యం, చక్కా సురేష్, రాకేష్, మంచి కంటి సుధా, నాగేశ్వరరావు, దర్శి సుబ్బారావు, వేమూరి శీను, దింట కుర్తి సుబ్బారావు, సోమిశెట్టి కిరణ్, నాగేశ్వరరావు, కనిశెట్టి వెంకట రమణయ్య, ఎంద్రపల్లి సత్యనారాయణ, వెంకటేశ్వర్లు, వాయిగండ్ల సుధీర్ పాల్గొన్నారు.

రాపూరు సీఐ సుబ్రమణ్యం బాధ్యతల స్వీకరణ

విశాలాంధ్ర-రాపూరు:రాపూరు పోలీస్ సీఐగా గుంటూరు విఆర్ నుండి బదిలీపై వచ్చిన మలిశెట్టి సుబ్ర మణ్యం రాపూరు సీఐగా సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పని చేస్తున్న సీఐ కోటీశ్వరరావు గుం టూరు విఆర్‌కు బదిలీ అ య్యారు.

'పోలీసుల స్పందన'కు 103 ఫిర్యాదులు

విశాలాంధ్ర బ్యూరో -నెల్లూరు:జిల్లా ఎస్పీ డాక్టరు కె. తిరుమలేశ్వ ర రెడ్డి ఆదేశాల మేరకు ఉమేష్ చంద్ర కాన్ఫరెన్స్ హాలులో ప్రజా సమస్యల పరిష్కార వేదిక 'స్పందన' కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 103 ఫిర్యాదులు స్వీకరించారు. సుదూర ప్రాంతాల ఫిర్యాదుదారులు అందరికీ భోజనాలు, మజ్జిగ అందించారు. జాబ్ కన్సల్టెన్సీ ద్వారా ఆన్ లైన్, వివిధ కంపెనీలలో ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పే వ్యక్తుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, డబ్బు కట్టి మోసం పోవద్దని సూచించారు. నిరాశ్రయులయిన వృద్ధ తల్లిదండ్రులను ఆస్తి కోసం వేధించడం, నిర్లక్ష్యం చేసే పిల్లలపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. భార్యాభర్తల మనస్పర్థల ఫిర్యాదులలో పలు మార్లు కౌన్సెలింగ్ నిర్వహించి కుటుంబాలు చక్కదిద్దాలని సూచించారు. నమోదు అయిన దొంగతనం, మిస్సింగ్, కిడ్నాప్ కేసులలో త్వరితగతిన దర్యాప్తు పూర్తి చేసి, చార్జ్ షీట్ ఫైల్ చేయాలన్నారు. నిందితులకు కఠిన శిక్షలు పడాలని, అలసత్వం ప్రదర్శించ కూడదని, స్పందన ఫిర్యాదులను క్షుణ్ణంగా పరిశీలించి, సంబంధిత అధికారులతో మాట్లాడి త్వరిత గతిన పరిష్కరించి బాధితులకు న్యాయం చేయాలని సూచించారు. స్పందనలో ఉద్యోగాలు, వృద్ధ తల్లిదండ్రులు వేధింపులు, నమోదైన కేసులలో పురోగతి, కుటుంబ కలహాలు, భర్త, అత్తారింటి వేధింపులు, భూ, ఆస్తి వివాదాలు, నకిలీ పత్రాలు, అధిక వడ్డీలు, ఆన్ లైన్, అనధికార చీటీలు, ఇతర వివాదాలు సమస్యల ఫిర్యాదులు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో డిఎస్‌పి డిటిసి, ఎస్‌సి, ఎస్‌టి సెల్ -2, దిశ, ఎస్‌బి సీఐ, కంప్లైంట్ సెల్ సిబ్బంది పాల్గొన్నారు.

గిరిజన కాలనీల సమస్యలు పరిష్కరించాలి

విశాలాంధ్ర - కావలి: పట్టణంలోని గిరిజన కాలనీల్లో ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పసుపులేటి పెంచలయ్య డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలోని 38వ వార్డు సుచేతనగర్ గిరిజన కాలనీలో సిపిఎం నాయకులు పర్యటించారు. ఈ సందర్భంగా పెంచలయ్య మాట్లాడుతూ ఈ సుచేతనగర్ కాలనీ ఏర్పడి సుమారు 40 సంవత్సరాలు అవుతున్నప్పటికీ సమస్యలు పరిష్కారం కాలేదన్నారు. ఇప్పటివరకు ఎన్నో ప్రభుత్వాలు మారినప్పటికీ ఈ కాలనీలోని ప్రజల సమస్యలు మాత్రం తీరలేదన్నారు. సమస్యలను పరిష్కరించడంలో అధికారులు వైఫల్యం చెందారని అన్నారు. ఎన్నికల సమయంలో ఎన్నో వాగ్దానాలు చేసి ఓట్లు వేయించుకొని గెలిచిన ప్రజాప్రతినిధులు ఇప్పటివరకు వీరి సమస్యలు పరిష్కరించకపోవడం దారుణం అన్నారు. ప్రజా ప్రతినిధులుగా గెలిచిన వారికి ఇలాంటి సమస్యలు కనపడకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. గిరిజన కాలనీకి ఇప్పటికీ ప్రధానమైన రోడ్డు వసతి లేదని, తాగునీటి కోసం మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకోవడం లేదని, ఉన్న బోరింగులు సక్రమంగా పనిచేయక శిథిలావస్థకు చేరాయ న్నారు. ఉన్న ఒక్క బావి కూడా శుభ్రత లేకపోవడంతో నీళ్లు వాడుకోవడానికి పనికి రావడం లేదన్నారు. మున్సిపాలిటీ వారు వేసిన కుళాయిల ద్వారా రెండు మూడు బిందుల కంటే ఎక్కువ నీళ్లు రావడంలేదని, మరికొన్ని వీధి కుళాయిలకు పూర్తిగా నీరు రావడంలేదని తెలిపారు. మున్సిపాలిటీలో భాగమైన ఈ కాలనీ ప్రజలు ఎన్నో సమస్యలు సంవత్సరాల తరబడి ఎదురుకుంటున్నారని, ప్రజా సమస్యలు పరిష్క పరిష్కరించాల్సిన మున్సిపల్ అధికారులు గాఢ నిద్రలో ఉన్నారని, ముఖ్యంగా ప్రజా సంక్షేమమే మా సంక్షేమం అని, గడపగడపకు జగనన్న పాలన అందిస్తున్నామని చెబుతూ తిరుగుతున్న ఎమ్మెల్యేకి ఇలాంటి సమస్యలు కనపడలేదా? అని ప్రశ్నిం చారు. పేదలు నివసించే ఇలాంటి కాలనీలు అభివృద్ధి చేయలేని ప్రభుత్వం, ప్రజాప్రతి నిధులు, మాది ప్రజా ప్రభుత్వం అని చెప్పుకుంటూ తిరుగుతుంటే ప్రజలు నమ్మే స్థితిలో ఉన్నారా? అని అన్నారు. అంతే కాకుండా పట్టణంలో మరి కొన్ని కాలనీలు అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్నాయన్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు వెంటనే జోక్యం కల్పించుకొని పలు సమస్యలతో సతమతం అవుతున్న సుచేతనగర్ ప్రజల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు కే చెన్నయ్య, తలపల రత్నం, మేడ వెంకటేశ్వర్లు, కాలనీ ప్రజలు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు జరిగితే సమాచారం అందించండి: ఆర్‌డీవో

విశాలాంధ్ర - కావలి : డివిజన్ పరిధిలోని మండలాలో గాని, మునిసి పాలిటీల పరిధిలోగాని ఎక్కడైనా 18 సంవత్సరాల లోపు యువతీ యువ కులకు బాల్యవివాహాలు జరుగుతున్నట్లు తెలిస్తే తక్షణమే సంబంధిత గ్రామ, వార్డు సచివాలయ మహిళా సంరక్షణ కార్యదర్శికి, పంచాయతీ కార్యదర్శికి తెలపాలని కావలి రెవెన్యూ డివిజన్ అధికారి వి.కే.శీనా నాయక్ తెలిపారు. బాల్య వివాహం జరిపిస్తే సంబంధిత వ్యక్తులపై సెక్షన్ 9, ఎ.పి.బాల్య వివాహాల నిరోధక చట్టం 2006 ననుసరించి నాన్ బెయిలబుల్ కేసులు నమోదు చేస్తారని తెలిపారు. డివిజన్ పరిధిలో ఎక్కడైనా బాల్య వివాహాలు నిర్వహిస్తున్నట్లు మీ దృష్టికి వచ్చినట్లయితే, తక్షణమే సమాచారంను ఐసిడిఎస్ కావలి ప్రాజెక్ట్ సిడిపివో (9440814530), ఐసిడిఎస్ వింజమూరు ప్రాజెక్ట్ సిడిపివో కు (6300372133), ఐసిడిఎస్ బుచ్చిరెడ్డిపాళెం ప్రాజెక్ట్ సిడిపివో (9989292567) లకు ఫోను ద్వారా గాని, స్వయంగా గాని తెలపాలని కోరారు.

బ్యాక్ లాగ్ పేపర్స్ ఉన్న విద్యార్థులకు అవకాశం

విశాలాంధ్ర బ్యూరో -నెల్లూరు: విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం పరిధిలోని అన్ని బిఇడి, బిపిఇడి, ఎంపిఇడి కళాశాలలో 2015 నుంచి 2020 విద్యా సంవత్సర కాలంలో విద్యనభ్యసించి పూర్తిగా ఉత్తీర్ణత పొందలేని విద్యారులందరికీ విశ్వవిద్యాలయం వారు ఒక అవకాశాన్ని కల్పించాలని నిర్ణయించారు. దీని ప్రకారం 2015 నుంచి 2020 విద్యా సంవత్సరకాలంలో బిఇడి, బిపిఇడి, ఎంపిఇడి కోర్సులో బ్యాక్ లాగ్ పేపర్స్ ఉన్న విద్యార్థులందరూ ఈ అవకాశాన్ని వినియోగించుకోవచ్చు. దీని నిమిత్తం ఈ నెల 21 వ తేది నుంచి 31 వ తేది వరకు పరీక్షలకు అప్లై చేసేందుకు అనుమతి ఇచ్చారు. ఈ తరహా విద్యార్థులందరూ ఇతరత్రా సమాచారం కోసం వారి వారి కళాశాల యజమాన్యాన్ని సంప్రదించవచ్చునని విక్రమ సింహపురి యూనివర్సిటీ పరీక్షల నియంత్రణాధికారి తెలిపారు.

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని మానవహారం

- 24న చలో విజయవాడను విజయవంతం చేయండి

విశాలాంధ్ర - కావలి: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సిఐటియు రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు పారిశుద్ధ్య కార్మికులు సోమవారం సిఐటియు ఆధ్వర్యంలో స్థానిక ఉదయగిరి బ్రిడ్జి సెంట ర్లో మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు పసుపులేటి పెంచలయ్య మాట్లాడుతూ ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం మున్సిపల్ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేయాలని, డైలీ కార్మికులను అవుట్ సోర్సింగ్ లో చేర్చాలని, కార్మికులకు రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలని, ఇన్సూరెన్స్ విధానం అమలు చేయాలని, ఆప్కాస్ విధానం రద్దు చేయాలని, పని భారం తగ్గించాలని, క్లాప్ డ్రైవర్లకు రూ.18500 వేతనం ఇవ్వాలని అన్నారు. ఇప్పటికే కార్మికులు అనేక సందర్భాలలో పోరాటాలు చేశారని రాష్ట్ర ప్రభుత్వం కార్మికుల సమస్యలు పరిష్కరించలేదని అన్నారు. కార్మికల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 24వ తేదీన చలో విజయవాడ కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు. కావలి మున్సిపాలిటీలో పని చేస్తున్న కార్మికులు మస్టర్లు ఆపివేసి అధిక సంఖ్యలో పాల్గొని ఛలో విజయవాడ కార్యక్ర మాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు జి మధుసూదన్ రావు, మేడ వెంకటేశ్వర్లు, తురక సీనయ్య, బిడదల మహేష్, నాయకులు జలదంకి బాబు, ఒంగోలు రమేష్, జే జేమ్స్, శివకోటయ్య, మహిళా నాయకులు పల్లెపాటి అనిత, పరుసు చిన్నమ్మ, కార్మికులు పాల్గొన్నారు.

26న వాహనాల వేలం

విశాలాంధ్ర - కావలి: స్పెషల్ ఎన్ఫోర్స్ మెంట్ బ్యూరో స్టేషన్ పరిధిలో వివిధ కేసుల్లో పట్టుకున్న వాహనాల వేలం 26వ తేది శనివారం నిర్వహిస్తున్నట్లు కావలి స్పెషల్ ఎన్ఫోర్స్ మెంట్ ఇన్స్ పెక్టర్ శ్రీనివాసరావు తెలిపారు. నెల్లూరు సెబ్ ఎన్ఫోర్స్మెంట్ సూపరింటెండెంట్ ఎస్.రవి కుమార్ ఆధ్వర్యంలో శనివారం ఉదయం 10 గంటలకు కావలి సెబ్ స్టేషన్ ఆవరణలో రెండు ద్విచక్ర వాహనాలు, ఒక ఆటో కువేలం జరుగునని, ఆసక్తి వున్నవారు పాల్గొనాలని తెలిపారు.

పేదల డాక్టర్ లక్ష్మీనరసారెడ్డి 96వ జన్మదిన వేడుకలు

విశాలాంధ్ర - కావలి: సామాన్య రైతు కుటుంబంలో జన్మించినా, తమ తండ్రి కోరిక మేరకు తాను తన సోదరులు వైద్య విద్య అభ్యసించి, పేదలకు అందుబాటులో సేవలు అందించామని డాక్టర్ సి లక్ష్మీనరసారెడ్డి పేర్కొన్నారు. విశ్రాంత జిల్లా వైద్యాధికారి, రెడ్ క్రాస్, రోటరీ క్లబ్ ల స్ఫూర్తి ప్రధాత, పేదల డాక్టర్ చిల్లకూరు లక్ష్మీనరసారెడ్డి 96వ జన్మదిన వేడుకలు స్థానిక కచేరిమిట్టలోని అయన గృహంలో అభిమానులు, రెడ్ క్రాస్, రోటరిక్లబ్, పెన్షనర్స్ అసోసియేషన్ సభ్యుల అధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ తన సంతానం పెద్ద నగరాలలో, విదేశాలలో స్థిరపడినా, తాను మాత్రం తనను ఆదరించిన కావలి ప్రజలసేవలోనే ఉన్నానని పేర్కొన్నారు. రెడ్ క్రాస్ చైర్మన్ దాకారపు రవిప్రకాష్, రోటరీ క్లబ్ జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ కె మాధవరెడ్డిలు మాట్లాడుతూ 96 సంవత్సరాలు నిండినా, డాక్టర్ ప్రతిరోజూ రెడ్ క్రాస్, రోటరీ క్లబ్ సేవా కార్యక్రమాలను పర్యవేక్షిస్తూ తగు సలహాలను అందిస్తుం టారన్నారు. రెడ్ క్రాస్ జిల్లా పాలకమండలి సభ్యులు గంధం ప్రసన్నాంజనేయులు మాట్లాడుతూ కరోనా వాక్సిన్ వేయించు కోవడానికి ప్రజలు భయపడే సమయంలో డాక్టర్ సి యల్ యన్ ముందుకు వచ్చి వాక్సిన్ వేయించుకుని దేశంలోనే వాక్సిన్ వేయించుకున్న అత్యధిక వయస్సు గల వ్యక్తిగా గుర్తింపు పొందారని, అప్పటి కలెక్టర్, ఎస్పీలు కావలికి వచ్చి అభినందించారని గుర్తుచేసారు. ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్, రోటరీ క్లబ్ సభ్యులు బుర్లా రఘుకుమార్ రెడ్డి, హరినారపరెడ్డి, సంయుక్త సురేంద్ర, ఓరుగంటి వెంకటేశ్వర్లు, మంగళగిరి వేణుగోపాల్ రావు, ఆకుల రమణయ్య, నల్లూరి రవికుమార్ పాల్గొన్నారు.

24 న మున్సిపల్ కార్మికుల ర్యాలీ జయప్రదం చేయాలని బైక్ ర్యాలీ

విశాలాంధ్ర బ్యూరో- నెల్లూరు: 24 న నిర్వహించనున్న మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేయాలని కోరుతూ విజయ వాడ లో నిర్వహించనున్న మున్సిపల్ కార్మికుల ర్యాలీని జయప్రదం చేయాలని కోరుతూ సోమవారం బైక్ ర్యాలీ నిర్వ హించారు. మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేయకపోతే నిరవధిక సమ్మెకు దిగుతామని, జగన్మోహన్ రెడ్డి ఇచ్చిన హామీని అమలు చేయాలని కోరారు. మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేస్తూ ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ నెల్లూరు నగరపాలక సంస్థ కమిటీ ఆధ్వర్యంలో సర్వోదయ కాలేజ్ గ్రౌండ్స్ నుండి బోసు బొమ్మ ఏబీఎం కాంపౌండ్ వరకు 'బైక్ ర్యాలీ' నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు నెల్లూరు నగర కార్యదర్శి జి నాగేశ్వరరావు, రూరల్ అధ్యక్షులు కొండా ప్రసాద్ మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేస్తానని జగన్ మోహన్ రెడ్డి ప్రతి పక్షంలో ఉన్న సందర్భం లో వాగ్దా నం చేశాడని అధికా రంలోకి వచ్చి ఐదేళ్లు పూర్తవుతున్న ఇంత వరకు అమలు దిశగా ఏ రకమైన చర్యలు తీసుకోలేదని అన్నారు. మునిసిపల్ కార్మికులను పర్మినెంట్ చేయాలని కోరుతూ రాష్ట్ర వ్యాప్తంగా మునిసిపల్ కార్మికు లం దరూ ఆగష్టు 24వ తేదీన 'చలో విజయ వాడ' నిర్వ హిస్తున్నామన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం పర్మినెంట్ చేసి ఇచ్చిన హామీని నెర వేర్చాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నగర కార్యదర్శి కత్తి శ్రీనివాసులు, మునిసి పల్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి కె. పెంచలనరసయ్య, మునిసి పల్ యూని యన్ నాయకులు అశోక్, బాలు, క్రిష్ణ, ఆనంద్, దేశ మూర్తి, సుబ్బు, మనోజ్, రమేష్, లోకేష్ పాల్గొన్నారు.

నెల్లూరు రూరల్‌ని నెంబర్ ఒన్ చేస్తాం: ఎంపీ

విశాలాంధ్ర బ్యూరో -నెల్లూరు:నెల్లూరు రూరల్ నియోజకవర్గాన్ని నెంబర్ వన్ చేస్తానని నెల్లూరు ఎంపీ, రూరల్ నియోజకవర్గ ఇంచార్జి ఆదాల ప్రభాకర్ రెడ్డి తెలిపారు.19వ డివిజన్లోని అరవింద నగర్ ఎక్స్టెన్షన్ ఏరియాలో సోమవారం సాయంత్రం గడపగడప కార్యక్రమాన్ని నిర్వహించారు. లక్ష్మీనారాయణ, కొండేటి శివారెడ్డి, పచ్చారవి ల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ వెళ్లిన ప్రతిచోట స్థానికులు ఆత్మీయంగా ఆహ్వానిస్తూ అభిమానంగా పలకరిస్తున్నారని చెప్పారు. ప్రతి ఇంటికి ఆర్థికంగా లక్షల రూపాయల్లో లబ్ది చేకూరిందని, అందుకే అందరూ సంతృప్తికరంగా ఉన్నారని సంతోషం వ్యక్తం చేశారు. ఈ సచివాలయం పరిధిలో మిగిలిపోయిన పనులకు 40 లక్షల రూపా యలతో పనులు చేస్తున్నామని చెప్పారు. ప్రతి సచివాలయానికి 40 లక్షల రూపాయలు చొప్పున నిధులను కేటాయించామని తెలిపారు. అవసరం అయితే ఇంకా కూడా నిధులను కేటాయిస్తామని తెలిపారు. ఈ కార్య క్ర మంలో డివిజన్ ఇంచార్జీలు లక్ష్మీనారాయణ, పచ్చారవి కొండేటి శివారెడ్డి, శ్రీధర్ రెడ్డి రాజా మస్తానయ్య కృష్ణ కామేశ్వరమ్మలు పాల్గొన్నారు. విజయ డెయిరీ చైర్మన్ రంగారెడ్డి,డిసిసిబి మాజీ చైర్మన్ ఆనం విజయకుమార్ రెడ్డి, కార్పొరేటర్లు బొబ్బల శ్రీనివాస యాదవ్, మోబినా, అవినాష్, వైసిపి నేతలు స్వర్ణ వెంకయ్య, ఆర్ఎస్ఆర్, జడ్పిటిసి మల్లు సుధాకర్ రెడ్డి, పెంచల్ రెడ్డి, రామ శివారెడ్డి, సునీల్ రెడ్డి, సాయి కృష్ణారెడ్డి, నిజాముద్దీన్, దేవిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, టీవీఎస్ కమల్, నరసింహారావు, విజయ్ రెడ్డి, సూరిబాబు, సురేష్ బాబు, శరత్చంద్ర బాబ్జి పాల్గొన్నారు.

ఇసుక అక్రమ రవాణా పట్టివేత

మూడు ట్రాక్టర్లు సీజ్

విశాలాంధ్ర-లింగసముద్రం :కందుకూరు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంటు సీఐ ఆదేశాల మేరకు ఎస్ఐ డి మౌలాలి సోమవారం మండల పరిధిలోని విఆర్ కోట గ్రామ సమీపంలోని మన్నేరు నది నుండి ఇసుకను ఎలాంటి అనుమతులు లేకుండా తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను సీజ్ చేశారు. ముగ్గురు డ్రైవర్లను అదుపులోకి తీసుకున్నారు. అనంతరం స్వాధీనం చేసుకున్న ట్రాక్టర్లను ముగ్గురు డ్రైవర్లను లింగసముద్రం పోలీస్ స్టేషన్‌లో అప్పగించారు. పోలీస్ స్టేషన్ హౌస్ ఆఫీసర్ ఏ మల్లికార్జున కేసు నమోదు చేశారు.

నేడు డయల్ యువర్ ఆర్టీసి డిఎం

విశాలాంధ్ర-రాపూరు: రాపూరు లోని ఏపీఎస్ ఆర్టీసి డిపో మేనేజర్ డయల్ యువర్ ఆర్టీసి డిఎం కార్యక్రమాన్ని మంగళ వారం ఉదయం 11గంటల నుండి 12 గంటల వరకు 1 గంట పాటు నిర్వ హించనున్నారు. ఆర్టీసి అభివృద్ధి, పలు విషయాలు పై ప్రజల సలహాలు, సందేశాలు సూచనలను ఉదయం 11గంటల నుండి 12 గంటల వరకు ఫోన్‌లో అందరికీ అందుబాటులో వుంటారు. ప్రజలు ఆర్టీసీ బస్సు ల విషయం పై తగు సూచనలను నేరుగా డిఎం తో మాట్లాడ వచ్చునని తెలిపారు. ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని రాపూరు ఆర్టీసీ డిపో మేనేజర్ వై. అనిల్ కుమార్ తెలిపారు.

వావిలేటిపాడులో మహాశక్తి చైతన్య రథయాత్ర

విశాలాంధ్ర బ్యూరో- నెల్లూరు: నెల్లూరు రూరల్ నియోజకవర్గ పరిధిలోని 12వ డివిజన్, వావిలేటి పాడులో మహాశక్తి చైతన్య రథయాత్ర కార్యక్రమంలో నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి, నగర మేయర్ పొట్లూరి స్రవంతి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి జెన్ని రమణయ్య, టీడీపీ నాయకులు కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి, మహాశక్తి ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ జలదంకి సుధాకర్ క్లస్టర్ ఇంఛార్జ్ సాబీర్ ఖాన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన సభలో రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ రేపటి రోజున సూర్యుడు తూర్పున ఉదయిస్తాడన్నది ఎంత వాస్తవమో ఈ రాష్ట్రంలో ఎప్పుడు ఎన్నికలు జరిగినా నారా చంద్రబాబు నాయుడు మళ్లీ ముఖ్యమంత్రి కావడం అంతే వాస్తవం అని శ్రీధర్ రెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో చింతా ప్రభాకర్ రెడ్డి, మావిళ్ల మధుసూదన్ రెడ్డి, తలపల జయవర్ధన్, కుంచాల విజయ్ భాస్కర్, మావిళ్ల రవి కుమార్ రెడ్డి, మడపర్తి శ్రీనివాసులు, మావిళ్ల గోపాల్ రెడ్డి, అన్నపురెడ్డి సురేష్, నాగులపాటి సుందర రామిరెడ్డి, సుధాకర్ రెడ్డి, అన్నపురెడ్డి సుధాకర్ రెడ్డి, అన్నపురెడ్డి వేణు, కుడుముల కృష్ణయ్య, కాకుమూరు ఏడుకొండలు, ఆలూరు సుధాకర్, మస్తానయ్య, కుండా వెంకట రమణయ్య, కుండా ఏడుకొండలు, కోవూరు సుధాకర్, రెహమాన్, కరిముల్లా, గౌస్, ఏసయ్య, అబ్రహం, తనూజ, మలాకి, అనిల్ పాల్గొన్నారు.

రఘును పరామర్శించిన కృష్ణారెడ్డి

విశాలాంధ్ర - కావలి: పట్టణంలోని తుఫాన్ నగర్ జంగాల కాలనీ లో నివసిస్తున్న శివ లింగం - రావమ్మ దంపతుల కుమారుడు రఘు కు ఇటీవల యాక్సిడెంట్ అయింది. కిమ్స్ హాస్పిటల్‌లో చికిత్స పొంది ఇంటికి వచ్చి విశ్రాంతి తీసుకుం టున్నాడు. సోమవారం ప్రముఖ పారిశ్రామిక వేత్త, కావ్య క్రిష్ణారెడ్డ్ ఛారిటబుల ట్రస్ట్ చైర్మన్, టీడీపీ నాయకులు కావ్య కృష్ణారెడ్డి రఘు కుటుంబాన్ని పరామర్శించి ధైర్యం చెప్పి ఆర్థిక సాయం అందించారు.

అమర జీవి త్యాగం స్టిక్కర్ల రూపంలో నేటితరానికి అందిస్తాం

విశాలాంధ్ర - కావ లి: స్టిక్కర్ల రూపంలో "ఇంటింటికి పొట్టి శ్రీరా ములు త్యా గం" కార్యక్ర మం ద్వారా అమరజీవి పొట్టి శ్రీరా ము లు ఆంధ్ర రాష్ట్ర పిత అనేది ఇప్పుడి తరానికి తెలపాలనేదే తమప్రయత్నమని అమరజీవి పొట్టి శ్రీరాములు పవిత్ర స్మ్రమూతి పరిరక్షణ సమితి సభ్యులు సోమవారం తెలిపారు. దేశంలో, ప్రపంచ దేశాల్లో తెలుగు వారందరూ గర్వించదగిన త్యాగశీలి అమరజీవి పొట్టి శ్రీరాములుకు భారతరత్న ఇవ్వాలని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దీని కోసం కృషి చేయాలన్నారు. ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు రాష్ట్రస్థాయిలో ఇంటింటికి అమర జీవి పొట్టి శ్రీరాములు త్యాగాల పైన అవగాహన పెంచుతూ, ప్రజల్లో అమరజీవి జీవితాన్ని ఆదర్శంగా తీసుకుని బాధ్యతాయుత పౌరులుగా సమాజంలో ఎదగడానికి, అదే విధంగా ఆంధ్రను అన్ని విధాల అభివృద్ధి చేయడానికి, నేటి తరానికి అమరజీవి సిద్ధాంతాలను తెలపడం, ఆయన ఆశయా లను కొనసాగించాలని కోరుతామన్నారు. ఈ కార్యక్రమంలో అమరజీవి పొట్టి శ్రీరాములు పవిత్ర స్మ్రమూతి పరిరక్షణ సమితి ఫౌండర్ అధ్యక్షులు జి. వేణుగోపాల్, సంస్థ గౌరవాధ్యక్షులు తిరువీధి రాధాకృష్ణయ్య, జిల్లా అధ్యక్షులు ఒరుగంటి రామకృష్ణ, పాదర్తి నాగరాజు, చీదెళ్ల కిషోర్ గుప్తా, గాదం శెట్టి మధుసూదన్ ఓరుగంటి సురేష్ శ్రీనివాసులు ఏల్చూ రవి, గాదంశెట్టి ప్రసాద్ పాల్గొన్నారు.

ఢిల్లీలో వియ్ -20 పీపుల్స్ సదస్సును అడ్డుకోవడం దుర్మార్గం

సిపిఎం రౌండ్ టేబుల్ సమావేశంలో అఖిల పక్షనాయకుల ఉద్ఘాటన

విశాలాంధ్ర- వలేటివారిపాలెం: సెప్టెంబర్ లో నిర్వహించ తలపెట్టిన జీ-20 దేశాల సమ్మిట్ నేపథ్యంలో ప్రజా సంఘాలు, ఆర్థిక వేత్తలు, రాజకీయ వేత్తలు, మేధావులతో కలిసి ఢిల్లీలోని సూర్జిత్ భవన్ లో (సిపిఎం కార్యాలయంలో) నిర్వహించ తలపెట్టిన వియ్-20 పీపుల్స్ సమ్మిట్ ను కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఆదేశాలతో పోలీసులు ఆఫీస్ గేట్లకు తాళాలు వేసి అడ్డుకోవడాన్ని దుర్మార్గ మైన చర్యగా సిపిఎం, సిపిఐ టీడీపీ, ఇతర ప్రజా సంఘాల నాయకులు పేర్కొన్నారు. ఈ చర్యలను నిరసిస్తూ సోమవారం ఉదయం వలేటివారి పాలెం లోని బీసీ హాస్టల్ వద్ద సిపిఎం వలేటివారిపాలెం మండల కమిటీ ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సీపీఎం నాయకులు వలేటివారిపాలెం మండల కార్యదర్శి మాదాల రమణయ్య అధ్యక్షత వహించారు. ఈ సమావేశంలో సిపిఎం మండల ఇన్‌చార్జి జీవి కుమార్, సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి భూసి సురేష్ బాబు, టీడీపీ మండల నాయకులు, మాజీ ఎంపీటీసీ వలేటి నరసింహం, అభ్యుదయ వాది మర్రి అంజయ్య, రాళ్లపాడు పరిరక్షణ రైతు కూలి సంఘం నాయకులు మిట్టనోసల సుభాను, సిఐటియు మండల కార్యదర్శి సాదు చెన్నకేశవులు, కెవిపిఎస్ నాయకులు హరి తదితరులు పాల్గొని మాటాడారు. వారు మాట్లాడుతూ ఢిల్లీలో జీ 20 దేశాల సమ్మిట్ సందర్భంగా మూడు రోజుల పాటు ప్రజాసంఘాలు నిర్వహించ తలపెట్టిన సెమినార్,వర్క్ షాపు ను కేంద్ర ప్రభుత్వం నిరంకుశంగా సూర్జిత్ భవన్ కు తాళాలు వేసి, పోలీసు బలగాలతో బిజెపి ప్రభుత్వం అడ్డుకోవడం దుర్మార్గ చర్యగా పేర్కొన్నారు. ప్రజలంతా ఎలాంటి చర్యలను అడ్డుకోవాలని కోరారు. భారతదేశంలోని ప్రతి పౌరుడు స్వేచ్ఛగా తమ అభిప్రాయాలను తెలిపే వాక్ సభ స్వాతంత్ర్య హక్కు కలిగి ఉన్నారన్నారు. ఇలాంటి విధానాలపై బీజేపీ అనుసరిస్తున్న నియంతృత్వ విధానాలు ప్రజలకు ఇబ్బంది కలిగించే విధంగా ఉన్నాయని, సిగ్గుతో తలవంచుకునేలా ఉన్నాయని పేర్కొన్నారు. అందరూ ఖండించాలని తెలిపారు. ఈ మీటింగ్ లో రైతు నాయకులు మానికొండ మదన్, తదితరులు పాల్గొన్నారు.

లోక్ సత్తా ఉద్యమ సంస్థకు 26 ఏళ్లు

విశాలాంధ్ర -లింగసముద్రం: సమాజంలో మార్పు కోసం ప్రజలే ప్రభువులంటూ ఏర్పడిన లోక్‌సత్తా ఉద్యమ సంస్థకు 26 ఏళ్లు అని లోక్‌సత్తా ఉద్యమ సంస్థ వ్యవస్థాపక సభ్యులు ఎం. మాలకొండా రెడ్డి పేర్కొన్నారు. ఐఏఎస్ అధికారిగా పనిచేసి ప్రజల చేత మనల్ని పొందిన డాక్టర్ నాగ భైరవ జయప్రకాష్ నారాయణ ఐఏఎస్ కు వాలంటరీ రిటైర్మెంట్ ఇచ్చి లోక్‌సత్తా ఉద్యమ సంస్థను 1997 ఆగస్టులో ఏర్పాటు చేశారని తెలిపారు. డాక్టర్ జయప్రకాష్ నారాయణ సమాజంలో మార్పు రావాలని చట్టసభల్లోకి నేరగాళ్ల అక్రమార్జన పరులను నివారించాలని కోరారు. మేధావులను, ప్రజా స్వామిక వాదులను, సేవాతత్పరులను, చట్టసభల్లోకి పంపా లని ప్రజలను చైతన్య పరుస్తున్నారన్నారు. ఉద్యమాలు చేస్తూ నిరంతరం పరిపాలనలో పారదర్శకత ఏర్పడాలని అవినీతిని నియంత్రించి ప్రజలకు మెరుగైన సేవలు అందించే వ్యవస్థలు రావాలని కోరారు. ఎన్నికల విధానంలో మార్పులు సిటిజన్ ఏర్పాటు సమా చార హక్కుచట్టం, నిరంతరం కేంద్ర ప్రభు త్వంపై పోరాడి సాధించడంలో వారి కృషి ఎనలేని దన్నారు. లోక్‌సత్తా ప్రజలే ప్రభువులని, నిజాయితీపరులు, సమర్థులు సమర్థులు చట్టసభల్లోకి రావా లని నిరంతరం ప్రజలను మేల్కొల్పుతున్న సంస్థ అని ఆయన తెలిపారు.

26 డివిజన్లలో రూ.150 కోట్లతో అభివృద్ధి: ఎంపీ

విశాలాంధ్ర బ్యూరో- నెల్లూరు: నెల్లూరు రూరల్ నియోజక వర్గంలోని 26 డివిజన్లలో 150 కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు చేపట్టినట్లు నెల్లూరు ఎంపీ, రూరల్ నియోజకవర్గం ఇన్‌చార్జ్ ఆదాల ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. 29వ డివిజన్‌లో స్థానిక కార్పొరేటర్ సత్తార్, సూరిబాబు, కొండ సాయి రెడ్డిల ఆధ్వర్యంలో సోమవారం డ్రెయినేజీల నిర్మాణానికి ఎంపీ ఆదాల శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 29వ డివిజన్‌లో 40 లక్షల రూపాయలతో డ్రెయినేజీలకు శంకుస్థాపన చేశామని తెలిపారు. గతంలో మూడు కోట్ల 67 లక్షల రూపాయలతో ఈ డివిజన్‌లో పనులు చేపట్టామని చెప్పారు. 60 నుంచి 70 లక్షల రూపాయలు ఇంకా ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నామని వాటిని ఎక్కడెక్కడ కావాలో తెలిపితే, ఆ పనులు కూడా చేపడతామని సంసిద్ధత వ్యక్తం చేశారు. ఎక్కడైనా చిన్న లోటు పాట్లు జరిగితే వాటిని కావాలని కొందరు పనిగట్టుకుని ప్రచారం చేస్తున్నారని, అయినా ప్రజలను వాటిని నమ్మే పరిస్థితిలో లేరన్నారు. రూరల్ నియోజక వర్గంలో వైసీపీకి రోజురోజుకూ అభిమానం పెరుగుతోందని, అందుకే తాము అడక్కుండా చాలా మంది పార్టీలో చేరుతున్నారని పేర్కొన్నారు. అభివృద్ధి, సంక్షేమాన్ని రెండు కళ్లలా భావించి అభివృద్ధి చేస్తున్న సీఎం జగన్‌మోహన్ రెడ్డి, అందరికీ సంక్షేమం అందాలనే ఉద్దేశంతో దూర దృష్టితో ఎన్నో కార్యక్రమాలు చేపట్టారని ప్రశంసించారు. ఇంతగా సమాజాభివృద్ధికి పాటు పడుతున్న సీఎం జగన్‌ను మమ్మల్ని వచ్చే ఎన్నికల్లో ఆశీర్వదించాలని కోరారు. కార్యకర్తకు పరామర్శ స్థానిక వైసీపీ కార్యకర్త అహ్మద్‌కు అనారోగ్యంగా ఉండడంతో ఎంపీ ఆదాల ఆయనను ఇంటికి వెళ్లి పరామర్శించారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో డిసిసిబి మాజీ చైర్మన్ ఆనం విజయకుమార్ రెడ్డి, స్థానిక కార్పొరేటర్ సత్తార్, స్థానిక నేత సూరిబాబు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో విజయ డెయిరీ చైర్మన్ రంగారెడ్డి, కార్పొరేటర్లు అవినాష్, మోబీనా, ఒరిస్సా శ్రీనివాసులు రెడ్డి, మూలే విజయభాస్కర్ రెడ్డి, వైసీపీ నేతలు స్వర్ణ వెంకయ్య, కోటేశ్వర్ రెడ్డి, జడ్‌పిటిసి మల్లు సుధాకర్‌రెడ్డి, అబూబకర్, నరసింహారావు, నవీన్ కుమార్ రెడ్డి, రామ శివారెడ్డి,ఆసిఫ్, టీవీఎస్ కమల్, నిజాముద్దీన్, ఖలీల్, రియాజ్, మధు, సురేష్ బాబు, కరీముల్లా, తలారి విటల్, నాయబ్ రసూల్ పాల్గొన్నారు.

ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం నిధులు దుర్వినియోగం

- గత నెల ఫిర్యాదుకు స్పందన ఏదీ?

విశాలాంధ్ర-రాపూరు: రాపూరు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో 60 లక్షల రూ పాయల నిధుల దుర్విని యోగంపై జూలై 3వ తేది స్పందన కార్యక్రమంలో తాను ఫిర్యాదు చేశానని అక్బర్ తెలిపాడు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ తాను గత నెలలో ఫిర్యాదు చేశానని, ఆ ఫిర్యాదును జిల్లా సహకార శాఖ అధికారికి 30 రోజుల లోపు పల పరిష్కార నిమిత్తం పంపగా సదరు అధికారిని విచారణకు వి.రవికుమార్ సబ్ డివిజనల్ రాపూరు కో-ఆపరేటివ్ ఆఫీసర్ వారిని జూలై 14 వ తేదీ నియమించగా విచారణ అధికారి తనకు జూలై 20 తేదీ పొదలకూరు పిఎసిఎస్ కార్యాలయానికి హాజరు కావాలని తన ఫోన్ కి సందేశం పంపారని తాను హాజరై ఫిర్యాదులోని ప్రతి అభియోగాలను కూలంకషంగా చర్చించారు. ఈ అభియోగాలన్నింటిని పరిశీలించేందుకు సమయం సరి పోదని అంటే తాను ఇంకా 30 రోజులైనా సమయం తీసుకుని సంఘ బ్యాంకు రికార్డులను పరిశీలించి నివేదిక ఇవ్వాలని కోరానని తెలిపారు. మళ్లీ జూలై 27 వ తేదీ విభాగేయ సహకార శాఖ అధికారి ద్వారా తయారు చేసిన ఒక ఎండోర్‌మెంట్సును అధికారులకు అనుకూలంగా తయారు చేసుకుని చదివి సంతృప్తి చెందినట్లు సంతకం చేయాలని కోరగా తాను సంతకం చేసేందుకు నిరాకరించానని తెలిపారు. ఇదే విషయం విభాగేయ సహకార శాఖ అధికారికి విచారణ అధికారికి తెలుపగా జూలై 28 తేదీ లేఖలో రాపూరు పిఎసిఎస్ సెక్షన్ 51 విచారణ పై స్టే ఆర్డర్ ఉన్నందున ఈ ఫిర్యాదులో ఉన్న విషయాలపై స్టే ఆర్డరు రద్దు పరిచి న తర్వాత విచారణ జరుపుతామని ఫిర్యాదు లోని విషయాలను విచారణకు స్పందన లోని ఎస్ఎల్ఏ సమయం సరిపోని కారణంగా ఈ ఫిర్యాదును ముగిస్తున్నామని తెలుపుతూ విభాగేయ సహకార అధికారి కార్యాలయం నెల్లూరు వారి నుండి జిల్లా సహకార అధికారి ఎఫ్ఏసి వారి హోదాలో సంతకం చేసి పంపారని, ఇలా అధికారులు తమ ఇష్టం వచ్చినట్లు చేయడానికి ఈ స్పందన దేనికో అర్థం కావటం లేదన్నారు. జగనన్న ప్రభుత్వంలో స్పందన కార్యక్రమం ఒక ప్రతిష్టాత్మకమైందని, ఇకనైనా ఈ ఫిర్యాదును ఆంధ్రప్రదేశ్ సహకార సంఘంలో చట్టం 1964 సెక్షన్ 52 కింద పరిగణలోకి తీసుకుని విచారణ చేయాలని బుధవారం జగనన్నకు చెబుదాం స్పందన కార్యక్రమంలో ఫిర్యాదు చేశామని రిటైర్డ్ సొసైటీ బ్యాంక్ ఉద్యోగి ఎస్.ఎం అక్బర్ తెలిపారు.

టీడీపీ అభ్యర్థికి డిపాజిట్ కూడా రానివ్వం: మంత్రి

విశాలాంధ్ర -ముత్తుకూరు: సర్వేపల్లి నియోజక వర్గంలో టీడీపీ అభ్యర్థికి డిపాజిట్ కూడా రాకుండా చేస్తామని రాష్ట్ర వ్యవసాయ, సహకార, ఫుడ్ ప్రాసెసింగ్, మార్కెటింగ్ శాఖ మంత్రి కాకాని గోవర్ధన్ రెడ్డి తెలిపారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద గిరిజనులు నిర్మించుకున్న ఇళ్లకు సి ఎస్ ఆర్ నిధుల ద్వారా అదనంగా 15 వేల రూపాయల పంపిణీ ఆయన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టిడిపి అధినేత చంద్రబాబు నాయుడుకు మతిభ్రమించి మాట్లాడు తున్నాడని, తాయిదులు ఇస్తాను కట్టుకోండి అంటూ చెప్పడం విచారకరమన్నారు. సర్వేపల్లి నియోజకవర్గం అన్ని విధాల అభివృద్ధి చేయడం జరిగిందన్నారు. నియోజకవర్గంలో జరిగిన పంచాయతీ వార్డు నెంబర్ల ఎన్నికల్లో మూడింటికి ఎన్నికలు జరిగాయని మూడింటిని తమ పార్టీ సానుభూతి అభ్యర్థులే గెలుపొందారు అలాగే మిగిలిన చోట్ల టిడిపికి పోటీ చేసింది అభ్యర్థులే కరువయ్యారన్నారు అందువల్ల ఏకగ్రీవం చేశారన్నారు. ఇప్పటికే ఫిషింగ్ పనులు కూడా ప్రారంభించనున్నామని, నాన్ ఫిషర్ మెన్ ప్యాకేజీ అని కూడా ఇవ్వడం జరిగింది అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల విష్ణువర్ధన్ రెడ్డి, ఎంపీపీ గండవరం సుగుణ, జడ్పిటిసి బందుల వెంకటరమణయ్య, నాయకులు దువ్వూరు చంద్రశేఖర్ రెడ్డి, కాకుదూరు లక్ష్మణ్ రెడ్డి, జనార్దన్ రెడ్డి, కోదండరామిరెడ్డి, ఆలపాక సీనయ్య, బూదూరు లక్ష్మి, విజయ్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు.

జగనన్నకు చెబుదాం అర్జీలు నిర్ణీత గడువులోపు పరిష్కరించాలి: కలెక్టర్

విశాలాంధ్ర బ్యూరో -నెల్లూరు: 'జగనన్నకు చెబుదాం' అర్జీలను నిర్ణీత గడువులోపు పరిష్కరించాలని కలెక్టర్ ఎం హరినారాయణన్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో జాయిం ట్ కలెక్టర్ కూర్మనాథ్ , ఇన్‌చార్జి డిఆర్ఓ పద్మావతి, జడ్పీ సీఈవో చిరంజీవితో కలిసి కలెక్టర్ స్పందన కార్య క్రమంలో పాల్గొని ప్రజల నుండి అర్జీలను స్వీక రించి, సంబంధిత అధికారులకు అందజేసి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లాలోని ఇతర ప్రాంతాలకు సంబంధించిన అర్జీలపై ఎండార్స్మెంట్ చేసి పరిష్కరించాలని ఆదేశించారు. అత్యవసరమైన అర్జీలపై వెంటనే స్పందించిన కలెక్టర్ సంబంధిత అధికారులతో ఫోన్లో మాట్లాడి పరిష్కరించాలని సూచించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అధికారులు స్పందన అర్జీల పరిష్కారానికి ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. అన్ని శాఖల అధికారులు తమకు సంబంధించిన అర్జీలను ముందుగా పరిశీలించాలన్నారు. వచ్చిన అర్జీలు మళ్లీ మళ్లీ వస్తుంటే, దరఖాస్తుదారుడి వద్దకు వెళ్లి సమస్య ఎందుకు పరిష్కారం కావడం లేదో అర్థమయ్యేలా వివరించాలన్నారు. ప్రతి సమస్య పరిష్కారానికి నిర్దిష్ట గడువు ఉంటుందని, ఆ గడువులోపు పరిష్కరించకపోతే మళ్లీ స్పందన కార్యక్రమానికి రావాలని అర్జీదారులకు సూచించారు. ఒక సమస్య పరిష్కారం కోసం ఎక్కువ మంది వచ్చి ఇతరులకు ఇబ్బంది కలిగించవద్దని అర్జీదారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో డిఆర్డిఎ, హౌసింగ్ పీడీలు సాంబశివరెడ్డి, నాగరాజు, డి ఎం హెచ్ ఓ పెంచలయ్య, డి.ఎస్.ఒ వెంకటేశ్వర్లు, డిపిఓ సుస్మిత, డిఇఓ గంగాభవాని జిల్లా అధికారులు పా ల్గొన్నారు.

చిల్లర దుకాణంలో చోరీ

విశాలాంధ్ర- ఉదయగిరి: పట్టణంలోని మసీదు కాంప్లెక్స్ లో చిల్లర దుకాణంలో చోరీ జరిగిన సంఘట న సోమవారం తెల్ల వారు జామున చోటు చేసుకుంది. మసీద్ కాంప్లెక్స్ లో రంగ య్య గత కొద్దికాలంగా చిల్లర దుకాణం నిర్వహిం చే వా డు. రోజు మాదిరిగానే షాపును తెరిచాడు. అంగట్లో గోడ కు కన్నం గమనించిన ఆయన చోరీ జరిగిందని గ్రహించి షాపు లోపలికి వెళ్లి పరిశీలించగా రూ.15 వేలు నగదు, కొన్ని సిగరెట్ ప్యాకెట్లు, గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేసి తీసుకెళ్లారని స్థానిక పోలీస్ స్టేషన్‌లో రంగయ్య ఫిర్యాదు చేశాడు. ఫిర్యాదు అందుకున్న ఎస్ఐ ఇంద్రసేనా రెడ్డి సంఘటన స్థలం వద్దకు చేరుకుని చోరీ వైనాన్ని పరిశీలిం చారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

స్థానిక కళలను కళాకారులను ప్రోత్సహించాలి

విశాలాంధ్ర- నెల్లూరు టౌన్: కళలను కళాకారులను ప్రోత్సహించాలని కేత అంకుల్ మెమోరియల్ ట్రస్టు ప్రధాన కార్యదర్శి కేత సుబ్బారావు అన్నారు. సోమవారం స్వతంత్ర పార్కులో జరిగిన విలేకరుల సమా వేశంలో ఆయన మాట్లాడుతూ స్థానిక కళలను కళాకారులను ప్రోత్సహించేందుకు ప్రతి ఒక్కరూ తోడ్పడాలని కోరారు. ఏవీకే ఫౌండేషన్ సౌజన్యంతో ఈ కార్యక్రమాన్ని 23 ఆగస్టు బుధవారం స్థానిక టౌన్ హాల్లో ఉదయం 10 గంటల నుండి నిర్వహిస్తున్నామన్నారు. ప్రముఖ గాయనీ గాయకుల తోపాటు బాలాజీ ఆర్కెస్ట్రా సంగీత విభావరి, శాస్త్రీయ నృత్యాలు, సీనియర్స్ జూనియర్స్ కలిపి ఏర్పాటు చేశార న్నారు. పాటల పోటీలు కూడా ఏర్పాటు చేశామని ఆయన పేర్కొన్నారు. గెలుపొందిన వారికి నగదు బహుమతి అందజేస్తున్నా మన్నారు. పోటీలో పాల్గొనే వారు తమ పేర్లను 7729942543కు తెలపా లన్నారు. పోటీలో పాల్గొనే వారు ఎలాంటి ఎంట్రీ ఫీజు చెల్లించ నవసరం లేదన్నారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు జయప్రకాష్, సత్యం, ఎస్‌వి రమణయ్య పా ల్గొన్నారు.

కుక్కలు, కోతుల బారి నుంచి రక్షణ కల్పించండి..

జగనన్న స్పందనలలో వినతి

విశాలాంధ్ర-రాపూరు: రాపూరులో కుక్కలతో, కోతులతో ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారని రాపూరు ఆర్ష్ వెల్ఫేర్ అసోసి యేషన్ చైర్మన్ పఠాన్ నూరెనబి సోమవారం రాపూరు మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో జరిగిన జగనన్నకు చెబుదాం -స్పందన కార్యక్ర మంలో అర్జీ అందించారు. ఈ సందర్భంగా రాపూరులో కుక్కలు, కోతులు గుంపులు, గుంపులు గా తిరుగుతూ ఉండడంతో ప్రైమరీ స్కూల్‌కు వెళ్లే చిన్న పిల్లలు స్టూడెంట్స్ ఎక్కడ కుక్కలు, కోతులు కరుస్తాయో అని భయాందోళనకు గురి అవుతున్నారు. కోతులు ఇళ్ల లోకి దూరి ఫ్రిజ్ లలో ఉన్న కూరగాయలను తిని మనషులను కరిచి వెళుతున్నాయన్నారు. కోతులు, కుక్కల బెడద నుంచి రాపూరు మండ ల, పట్టణ ప్రజలను కాపాడాలని అర్జీని ఆర్ష్ వెల్ఫేర్ అసోసియేషన్ చైర్మన్ పఠాన్ నూరేనబి అందించారు.

అగ్ని ప్రమాద బాధితులను ఆదుకోండి..

విశాలాంధ్ర -బుచ్చిరెడ్డిపాలెం: బుచ్చి మండ లం లోని మలిదేవి కాలువ గట్టు వద్ద జరిగిన అగ్ని ప్రమాదం కారణంగా సర్వం కోల్పోయిన గిరిజన బాధితులకు అండగా ఆదుకోవాలని కోరుతూ బుచ్చి మండల అధ్యక్షులు మాధవ్ ఆధ్వర్యంలో నియోజకవర్గ జనసేన కేర్ టేకర్ గుడి హరి కుమార్ రెడ్డి తహశీల్దారుకి అర్జీ ఇచ్చి అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో అందరు స్వాతంత్ర్య సంబరాలు జరుపుకుంటున్న సందర్భంలో బుచ్చిలో జరిగిన ఒక హేయమైన సంఘటన యావత్ దేశం మొత్తం సిగ్గుతో తలదించు కోవాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. కొందరు అధికార పార్టీ నాయకుల స్వార్థానికి పేద గిరిజనులు బలవుతున్నారని, గిరిజనులు వాళ్లు ఏమైనా బుచ్చి పట్టణంలో విలువైన స్థలంలో నివసించడం లేదని, ఎక్కడో సమాజానికి దూరంగా కాలువ గట్టు మీద నివసిస్తుంటే ఆఖరికి అది కూడా ఓర్చు కోలేని అధికార పార్టీ నాయకులు వాళుగుడిసెలు తగుల బెట్టించారన్నారు. ఆ రోజుల్లో స్వాతంత్ర్యం కోసం పోరాడిన నాయ కులు ఇప్పుడు కానీ బతికి ఉంటే ఇలాంటి వాళ్ల కోసమా తాము ప్రాణ త్యాగం చేసి స్వాతంత్రం తీసుకొచ్చిందని పశ్చాత్తాప పడే వాళ్లు అన్నారు. వాళ్లకి న్యాయం జరిగే వరకు జనసేన అండగా ఉంటుందని, గిరిజన బాధితులకి స్థలం కేటాయించి, పక్కా ఇళ్లు నిర్మించే వరకు తమ పోరాటం ఆగదన్నారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ జిల్లా కార్యదర్శి పవన్, ప్రసాద్, సాయి, బుచ్చిమండల జనసైనికులు పాల్గొన్నారు.

స్పందనకు ఐదు అర్జీలు

విశాలాంధ్ర- జలదంకి: జలదం కి మండల తహశీల్దారు కార్యా లయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి ప్రజల నుంచి ఐదు అర్జీలు వచ్చినట్లు తహశీల్దారు పద్మావతి తెలిపారు. త్వరితగతిన అర్జీదారులకు పరిష్కారం అందిస్తామన్నారు. స్పందన కార్యక్రమానికి పలు శాఖల అధికారులు హాజరయ్యారు.

రైతులకు బహిరంగ మార్కెట్ వ్యాల్యు ప్రకారం నష్టపరిహారం చెల్లించాలి

- కలెక్టరేట్ ఎదుట సంఘాల నాయకుల ధర్నా

విశాలాంధ్ర-నెల్లూరు సిటీ: బహిరంగ మార్కెట్ విలువ ప్రకారం రైతులకు నష్టపరిహారం చెల్లించాలని రైతులు డిమాండ్ చేస్తూ, సోమవారం కలెక్టరేట్ ఎదుట ఏపీ రైతు సంఘం, ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం, ఏపీ కౌలు రైతు సంఘాల సంయుక్త ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఎం. వెంగయ్య, జిల్లా అధ్యక్షులు పి. శ్రీరాము లు, ఉపాధ్యక్షులు సెంటర్ రాజగోపాల్ లు మాట్లాడుతూ జాతీయ రహదారి 67, 71 నిర్మాణంలో భాగంగా రైతులు భూములు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. భారత్ మాల, సాగర్ మాల పేరుతో ఈ రహదారుల నిర్మాణాలు చేపట్టనున్నారని తెలిపారు. ఈ నిర్మాణాల కోసం మర్రిపాడు మండలం నుండి అనంతసాగరం, చేజర్ల, కలువాయి, పొదల కూరు, మనుబోలు, వెంకటాచలం, ముత్తుకూ రు మండలాలలో సుమారు 32 గ్రామాలు సర్వే చేశారని తెలిపారు. కేవలం భూములు కోల్పోయిన రైతులకు నామమాత్రంగా నష్ట పరిహారం చెల్లించి స్వాధీనం చేసుకుంటున్నారని ఆరోపించారు. ఇటువంటి విధానం దారుణమని ఆరోపించారు. బహిరంగ మార్కెట్ విలువ ప్రకారం భూములు కోల్పోతున్న రైతులకు నష్ట పరిహారం చెల్లించాలని కోరారు. అనంతరం కలెక్టర్ హరి నారాయణ కు వినతి పత్రం అందజేశారు. ఈ ధర్నాలో రైతు సంఘాల నాయకులు ఓడూరు వెంకట కృష్ణయ్య, జొన్నలగడ్డ వెంకమరాజు, గంటా లక్ష్మిపతి, తదితరులు పాల్గొన్నారు.

జీవో నెంబర్ 117ను రద్దు చేయాలి

- కలెక్టరేట్ ఎదుట డిఈడి నిరుద్యోగుల ధర్నా

విశాలాంధ్ర-నెల్లూరు సిటీ: జీవో నెంబర్ 117ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ డిఈడి నిరుద్యోగులు సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా డిఈడి నిరుద్యోగులు టీ. నాగేంద్ర కుమార్, కే.కార్తీక్ మాట్లా డుతూ అన్ని పాఠశాలలో ఒకటి నుండి 5వ తరగతి విద్యార్థులకు బోధించడానికి డిఈడి అర్హత కలిగిన ఉపాధ్యాయులను నియమించాలని కోరారు. 3,4,5 తరగతుల విద్యార్థులను ఉన్నత పాఠశా లలకు బదిలీ చేసి, స్కూల్ అసిస్టెంట్ వద్ద బోధిస్తున్నారని తెలిపారు. దీని వల్ల ప్రాథమిక పాఠశాలలో 1,2 తరగతులు మాత్రమే మిగిలి, ఎస్‌జిటి ఉపాధ్యాయుల అర్హత కేవలం ఈ రెండు తరగతులకే బోధించేలా తగ్గించారని తెలిపారు. మూ డు నాలుగు ఐదు తరగతులను ఉన్నత పాఠశాలలకు బదిలీ చేయడం వల్ల ప్రాథమిక పాఠశాలల్లో ఎస్జీటీ ఉపాధ్యా యుల అవసరం తగ్గిపోయి, డీఈడీ అర్హత కలిగిన వేలాది మంది అభ్యర్థులు ఉద్యోగ అవకాశాలు కనుమరుగయ్యాయని ఆవేద న వ్యక్తం చేశారు. ఎస్‌జిటి ఉపాధ్యాయ అర్హతని, డీఈడీ శిక్షణ పొందిన అభ్యర్థుల ఉద్యోగ అవకాశాలను కాపాడాలన్నారు. రాష్ట్రంలో అమలవుతున్న జీవో నెంబర్ 117 ను తక్షణం రద్దు చేసి, ఒకటి నుండి ఐదు తరగతులకు డిఈడీ అర్హత కలిగిన ఎస్‌జిటి ఉపాధ్యాయులచే మాత్రమే బోధించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం కలెక్టర్ హరినారాయణన్‌కు వినతిపత్రం అందించారు. ఈ ధర్నాలో డిఈడి విద్యార్హత కలిగిన నిరుద్యోగులు పాల్గొన్నారు.

రేకుల షెడ్డుకు శంకుస్థాపన

విశాలాంధ్ర- బుచ్చిరెడ్డిపాలెం : మండలంలోని జొన్నవాడ గ్రామంలో వెలసిన మల్లి కార్జున స్వామి కామాక్షి సా యి అమ్మవార్ల భక్తులు సౌకర్యార్థం దాతలు వల్లూరు రవీంద్ర రెడ్డి దంపతులు సహకారంతో దేవస్థానం ప్రాకార మండ పం చుట్టూ గాల్వాల్యూమ్ రూఫ్ షీట్ తో షెడ్ నిర్మాణం చేసేందుకు సోమవారం ఉదయం దేవస్థాన చైర్మన్ పుట్టా సుబ్రహ్మణ్యం నాయుడు దంపతులు, దేవ స్థాన కార్యనిర్వాహణాధికారి డబ్బుగుంట వెంకటేశ్వర్లు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చ కులు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

సంతృప్తి స్థాయిలో సంక్షేమ పథకాలు

విశాలాంధ్ర- బుచ్చిరెడ్డిపాలెం: రాష్ట్రం లోని ప్రతి కుటుంబానికి సంతృప్తి స్థాయిలో సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి దే అని కోవూరు ఎమ్మెల్యే నల్లపురెడ్డి ప్రసన్న కుమార్ రెడ్డి అన్నారు. సోమ వారం నగర పంచాయతీలోని 13వ వార్డులో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వ హించారు. ఈ సందర్భంగా శాసన సభ్యులు ఇంటింటికి వెళ్లి ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డిని వచ్చే ఎన్నికల్లో ఆశీర్వదించి అండగా నిలవాలని ప్రజలను కోరారు. ప్రజల సమస్యలను ఆ ప్రాంత సమస్యలను ఆయన అడిగి తెలుసుకున్నారు. గడిచిన నాలుగు సంవత్సరాల పాలనలో వైసీపీ ప్రభుత్వం ద్వారా ఆయా కుటుంబాలకు అందించిన సంక్షేమ పథకాల లబ్దిని మున్సిపల్ చైర్ పర్సన్ మోరల్ సుప్రజా మురళి, కౌన్సిలర్లు 13వ వార్డు కౌన్సిలర్ పట్టా లక్ష్మీకాంతమ్మ, అనంతమ్మ, యానాద్ రెడ్డి, శివ కుమార్ రెడ్డి, చేర్ల ప్రసాద్, షేక్షావల్ జొన్నవాడ ఆలయ చైర్మన్ పొట్ల లక్ష్మీ సుబ్రహ్మణ్యం నాయుడు వివరించారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు, మండల కన్వీనర్ చర్ల సతీష్ రెడ్డి, టంగుటూరి మల్లారెడ్డి, విజయభాస్కర్ రెడ్డి, టెంకాయ సుధాకర్, విల్సన్ పాల్గొన్నారు.

గెలుపొందిన వైసీపీ సభ్యులకు ఘన సన్మానం

విశాలాంధ్ర-రాపూరు: రాష్ట్ర వ్యాప్తంగా జరిగిన గ్రామ పంచాయతీ ఉప ఎన్నికల్లో భాగంగా రాపూరు మండలంలోని మూడు పంచాయతీలలో మూడు వార్డు నెంబర్లకు జరిగిన ఎన్ని కల వైసీపీ వార్డు సభ్యుల లో గోనుపల్లిలో స్థానికులు మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్, ప్రముఖ పుణ్య క్షేత్రమైన పెంచలకోన దేవస్థాన పాలకవర్గ మాజీ చైర్మన్ నెల్లూరు రవీంద్రారెడ్డి పర్యవేక్షణ లో ఏకగ్రీవం ఎన్నిక కాగా, గిలకపాడు ఎన్నికల్లో 48 ఓట్లు అత్యధిక మెజారిటీతో వైసీపీ కైవసం చేసుకుంది. ఈ సందర్భంగా వెంకటగిరి నియోజక వర్గ సమన్వయకర్త నేదురుమల్లి రాం కుమార్ రెడ్డి ఆదేశాల మేరకు గెలిచిన అభ్య ర్థులకు రాపూరు మండల ప్రజా పరిషత్ కార్యాలయ అవరణలో రాపూరు వ్యవసాయ సలహా మండలి చైర్మన్, ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెంచల కోన దేవస్థాన పాలకవర్గ మాజీ చైర్మన్ నెల్లూరు రవీంద్రారెడ్డి ఆధ్వర్యంలో శాలువాతో సన్మా నించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తు న్నారని ఆయ న పేదల సంక్షేమం కోసం మరిన్ని పథకాలు అందజేస్తున్నారని, రాబోయే ఎన్నికల్లో నేదురుమల్లి రాంకుమార్ రెడ్డి కి రాపూరు మండలం నుండి మంచి మెజారిటీ అందిస్తామని నెల్లూరు రవీంద్రా రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపి పోలంరెడ్డి పెంచలరెడ్డి, మండల నాయకులు ఏటూరు మురళీ మోహనరెడ్డి, కేతు సుబ్బారెడ్డి, బండి రత్నాకర్ రెడ్డి, సచివాలయం కన్వీనర్ మాదమాల పిచ్చిరెడ్డి, దమ్మాయి రమణయ్య, ఉమా మహేశ్వరరెడ్డి, రాపూరు మాజీ సర్పంచ్ వెంకట సుబ్బయ్య, ఏపూరు గోపాల్ రెడ్డి, గడ్డం వెంకటరమణారెడ్డి, రేపూరు వర బాబు, చెల్లటూరు రమణారెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

రైతులకు వ్యవసాయ అధికారి సలహా

విశాలాంధ్ర -కందుకూరు రూరల్: కందుకూరు మండలం లోని చుట్టు గుంట గ్రామంలోని రైతు కంద్రా మాలకొండయ్య మినుముల పొలంను మండల వ్యవసాయాధి కారి రాము సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం మినుము రకం పీయు 38 మొక్కకు సీతాఫలం తెగులు ఆశించిందని తెగులు సోకిన ఆకులు ముడుతలుగా ఏర్పడి మందంగా, పెద్దవిగా పెరుగుతాయని, మొక్కలు పూత పూయక వెర్రి తలలు వేస్తాయన్నారు. ఇవి పేను బంక ద్వారా వ్యాపిస్తుందని, వీటి నివారణకు లీటరు నీటికి 2 మిల్లీ లీటర్ల డైమిథోయేట్ లేదా 1.5మిల్లీ లీటర్ల మోనోక్రోటోఫోస్ కలిపి పిచికారి చే యాలన్నారు. తెగులు సోకిన మొక్కలను పీకి తగుల బెట్టాలని, తెగులు సోకిన మొక్కల నుంచి విత్తనం తీసు కోకూడదని మండల వ్యవసాయాధికారి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇంఛార్జి విఏఏ గ్రామ వ్యవసాయ సహా యకులు కె శరత్ కుమార్ పాల్గొన్నారు.

ఇసుక, గ్రావెల్ అక్రమ రవాణా అరికట్టాలి

-కలెక్టర్‌కు జనసేన నాయకుల వినతి

విశాలాంధ్ర-నెల్లూరు సిటీ: కోవూరు నియోజకవర్గం, బుచ్చిరెడ్డిపాలెం మండలం, మినగల్లు తదితర గ్రామాలలో ఇసుక గ్రావెల్ అక్రమ రవాణాను అరికట్టాలని, జనసేన నాయకులు గునుకుల కిషోర్ కోరారు. ఈ మేరకు సోమవారం స్పందన కార్యక్రమంలో కలెక్టర్ హరినారాయణకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కిషోర్ మాట్లాడుతూ గ్రామంలో పాలతిప్ప వద్ద దాదాపు పది ఎకరాల కొండలను తవ్వి అక్రమ రవాణా చేస్తున్నారని ఆరోపించారు. తవ్వుకుంటూ పోతే ఆ ప్రాంతమంతా లోయలు గా మారే అవకాశం ఉందన్నారు. సుమారు 110 ఇసుక రీచ్‌లను తవ్వకాలు నిలిపివేయాలని సుప్రీంకోర్టు ఆదేశాలు ఉండగా, వాటిని బేఖాతరు చేస్తూ మినగల్లు గ్రామంలో డంపింగ్ యార్డ్ బిల్లును చూపించి ఇసుక తవ్వకాలు జరుపుతున్నారు. వీటి విషయమై ఎమ్మార్వో ,మైనింగ్, సెబ్ ఎవరిని అడిగినా ఒకరి మీద ఒకరు చెప్పుకుంటూ దాటవేస్తున్నారని ఆరోపించారు. అక్రమ రవాణా పై సర్పంచులు ప్రశ్నిస్తే దాడులకు పాల్ప డుతున్నారన్నారు. స్థానిక ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారని తెలిపారు. తక్షణమే జిల్లా ఉన్నతాధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. జనసేన కార్యకర్తలు వినతి ఇచ్చిన వారిలో ఉన్నారు.

లింగసముద్రం ఎస్ఐగా ఎం బాజీబాబు

విశాలాంధ్ర- లింగసముద్రం : లింగసముద్రం ఎస్ఐగా ఎం.బాజీ బాబును నియమిస్తూ జిల్లా ఎస్పీ తిరుమలేశ్వర్ రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో ఎస్ఐగా విధులు నిర్వహించిన ఆవుల వెంకటేశ్వర్లు సీఐగా పదోన్నతి పొందడంతో ఆయన స్థానంలో దర్గా మిట్ట ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న బాజీ బాబును లింగసముద్రం ఎస్ఐగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

రెడ్ క్రాస్ క్యాన్సర్ ఆస్పత్రికి రూ.5 లక్షల విరాళం

విశాలాంధ్ర -బ్యూరో నెల్లూరు : ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ శ్రీ పొట్టి శ్రీ రాములు నెల్లూరు జిల్లా శాఖ క్యాన్సర్ ఆస్పత్రి కోసం 5 లక్షల రూపాయ లను విరాళంగా నాతా సీతయ్య, నాతా రోశమ్మ పేరుపై వారి కుమారుడు నాతా సుధాకర్ రావు, కోడలు నాతా విజయకుమారి కలెక్టర్ యం హరి నారాయణన్ చేతుల మీదుగా మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ యం నాగేశ్వరరావుకి చెక్‌ను అందించారు. ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ నెల్లూరు జిల్లా శాఖ మేనేజింగ్ కమిటీ సభ్యులు యాలమూరి రంగా రావు, రెడ్ క్రాస్ జీవిత కాల సభ్యులు జలదంకి సుబ్బా రావు కనుమూరు సురేష్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు.

వైసీపీది అప్రజాస్వామిక పాలన: మాజీ మంత్రి

విశాలాంధ్ర బ్యూరో -నెల్లూరు: వైసీపీ ప్రభుత్వం అప్రజాస్వామిక పాలన సాగి స్తోందని మాజీ మంత్రి నారాయణ అన్నారు. నగరంలోని 13 డివిజన్ 246 పోలింగ్ బూత్ పరిధిలో మాజీ మంత్రి నారాయణ, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి పర్యటించారు. ఆ పరిధిలోని ప్రజలతో ఆయన మాట్లాడి ఓటు ప్రాముఖ్యతను తెలిపి అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ ఓటు నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి నారాయణ మాట్లాడుతూ ఎక్కడ చూసినా టీడీపీకి విశేష ఆదరణ లభిస్తోందన్నారు. వైసీపీ పాలన ప్రజాస్వామికంగా ఉందని మండిపడ్డారు. మాట్లాడితే కేసులు పెట్టే నీచమైన సంస్కృతికి వైసీపీ తెర తీసిందని ఆగ్రహిం చారు. 2024లో మీ అమూల్యమైన ఓటును నమోదు చేసుకుని ప్రజాస్వామ్యాన్ని కాపాడే టీడీపీని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కృష్ణయ్య, ఇన్‌చార్జి కాయల తిరుపతి, అధ్యక్షుడు తానెమస్తాన్, మాజీ కౌన్సిలర్ దేవాదాసు, కాయల మధు, నియోజకవర్గ పార్టీ పరిశీలకులు షేక్ కరీముల్లా పాల్గొన్నారు.

మల్లికార్జున స్వామి, కామాక్షి తాయి ఆలయ చైర్మన్‌కు పలువురి శుభాకాంక్షలు

విశాలాంధ్ర -బుచ్చిరెడ్డిపాలెం : మల్లికార్జున స్వామి, కామాక్షి తాయి ఆలయ చైర్మన్ పుట్టా లక్ష్మీ సుబ్రహ్మణ్యం నాయుడు, సతీమణి లక్ష్మీకాంతమ్మ దంపతులు 43వ పెళ్లి రోజు సందర్భంగా సోమవారం వారికి దేవస్థాన కార్యనిర్వాహణాధికారి డబ్బు గుంట వెంకటేశ్వర్లు స్వీట్లు, పూల మాలలు, శేషవస్త్రాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఆలయ పాలక మండలి సభ్యులు స్వీట్లు, పూలమాలలు, శేషవస్త్రాలు అందజేసి పెళ్లి రోజు శుభాకాంక్షలు తెలిపారు. 43వ పెళ్లి రోజు సందర్భంగా దంపతులు గోత్ర నామా లతో మల్లికార్జున స్వామి, కామాక్షితాయి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు, వేదపండితులు, పురోహితులు, దేవస్థాన సిబ్బంది, తదితరులు దంపతలిద్దరికీ ప్రత్యేకంగా పెళ్లి రోజు శుభాకాంక్షలు తెలిపారు.

మహిళల ఆర్థిక బలోపేతానికే కుట్టు శిక్షణ కేంద్రం

- ఉద్యోగాలు లేవు..ఉపాధి లేదు..
- వెనుకబడ్డ కందుకూరు ప్రజల కోసం మీరేం చేశారు ?
- ఎమ్మెల్యే మహిధర్ రెడ్డిని ప్రశ్నించిన ఇంటూరి నాగేశ్వరరావు
- కందుకూరును ఇండస్ట్రియల్ హబ్ గా మారుస్తామని హామీ

విశాలాంధ్ర- కందుకూరు రూరల్: అన్ని రకాలుగా వెనుకబడ్డ కందుకూరు నియోజకవర్గ ప్రజల బాగుకోసం, భావితరాల భవిష్యత్తు కోసం ఏం చేశారో చెప్పాలని స్థానిక వైసీపీ ఎమ్మెల్యే మానుగుంట మహీధర్ రెడ్డి ని, కందుకూరు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ ఇంటూరి నాగేశ్వరరావు సూటిగా ప్రశ్నించారు. థర్టీ ఇయర్స్ ఇండస్ట్రీగా చెప్పుకునే ఎమ్మెల్యే ఈ ప్రాంతానికి ఒక పరిశ్రమ గాని, మరేదైనా ఉపాధి అవకాశాలు గానీ తీసుకు రాలేక పోయారని ఘాటుగా విమర్శించారు. మహిళలకు స్వయం ఉపాధి కల్పనే లక్ష్యంగా, కందుకూరు లోని పార్టీ కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన ఉచిత కుట్టు శిక్షణా కేంద్రాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. అధిక సంఖ్యలో మహిళలతో పాటు పార్టీ నాయకులు, కార్యకర్తలు కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు గారు మాట్లాడుతూ పేద, మధ్యతరగతి మహిళలు తమ కాళ్ళ మీద తాము నిలదొక్కుకునేలా, తమ కుటుంబా లకు ఆసరాగా నిలిచేలా ఏదైనా చెయ్యాలనే ఉద్దేశంతో ఈ శిక్షణా కేంద్రాన్ని ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. మొదట 50 మందికి శిక్షణ మొదలుపెట్టామని, రెండు నెలల శిక్షణ అనంతరం ఉచితంగా కుట్టు మిషన్లు ఇస్తామన్నారు. ఇకనుంచి ఈ శిక్షణా కేంద్రం నిరంతరం కొన సాగుతుందని, నియోజకవర్గంలోని మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. శిక్షణ అనంతరం, మహిళలకు పూర్తిస్థాయి ఉపాధి కల్పన ఆలోచనలో వున్నామన్నారు. నారా లోకేష్ ఆధ్వర్యంలో మంగళగిరి నియోజకవర్గంలో ఇలాంటి కేంద్రం నడుస్తోందని, జూట్ పరిశ్రమ ఏర్పాటు ద్వారా అక్కడి మహిళలకు పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు కల్పించారన్నారు. అదే స్ఫూర్తితో, కందుకూరు నియోజక వర్గంలో కూడా చిన్న తరహా పరిశ్రమలు ఏర్పాటు చేసి, ఇక్కడ శిక్షణ పొంది న మహిళలకు ఉపాధి కల్పిస్తామని స్పష్టం చేశారు. వైసిపి ప్రభుత్వ హయాంలో కందుకూరు ప్రాంతానికి ఎలాంటి మేలు జరగలేదని, యువతకు ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలు లేక వలసలు వెళుతున్నారని నాగేశ్వరరావు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ప్రాంత యువకులు, మహిళలను ఆదుకోవడంపై స్థానిక ఎమ్మెల్యే దృష్టి పెట్ట లేదని, చంద్రబాబు నాయుడు ఎంతో కష్టపడి తీసుకొచ్చిన ఏషియన్ పేపర్ పరిశ్రమను వైసిపి నేతలు వెళ్లగొట్టారన్నారు. రాబోయే టీడీపీ ప్రభుత్వంలో కందుకూరును ఇండస్ట్రియల్ హబ్ గా మార్చే ఆలోచనతో ఉన్నామన్నారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో కందుకూరు ప్రాంతంలో మహిళలకు ఉచిత కుట్టు శిక్షణ ఇవ్వడంతో పాటు ఉచితంగా మిషన్లు కూడా అందజేసిన విషయాన్ని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. అబద్ధపు హామీలతో జగన్ రెడ్డి మోసం చేసిన వైనాన్ని గుర్తించాలన్నారు. వైసీపీ ప్రభుత్వ చేతగాని పరిపాలనను, టీడీపీ అధికారంలోకి రావాల్సిన అవసరాన్ని, మహిళలు ఇంటింటికి తిరిగి ప్రచారం చెయ్యాలన్నారు. మహిళలకు ఏ కష్టం వచ్చినా వెంటనే స్పందించి అండగా నిలుస్తా నన్నారు. నియోజకవర్గ పరిశీలకురాలు కె. కుసుమకుమారి మాట్లాడుతూ కుట్టు శిక్షణ కేంద్రం ఏర్పాటు విషయం గొప్ప ఆలోచన అని, మంగళగిరి తర్వాత మొదటిసారిగా కందుకూరులో ఇలాంటి కార్యక్ర మం నిర్వహిస్తున్నారన్నారు. ఇంటూరి నాగేశ్వరరావుకి మహిళ లందరూ తోడ్పడి రాబోయే ఎన్నికల్లో అత్యధిక మెజారిటీతో గెలిపించా లన్నారు. మహిళలు కుట్టు శిక్షణను సద్వినియోగం చేసుకోవా లని సూచించారు. అంతకుముందు నందమూరి తారక రామారావు, కుట్టు మిషన్ సృష్టికర్త విలియమ్స్ హోవే చిత్ర పటాలకు నాయకులు పూల మాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కందుకూరు పట్టణ పార్టీ అధ్యక్షులు దామా మల్లేశ్వరరావు, కందుకూరు మండల పార్టీ అధ్యక్షులు నార్నే రోశయ్య, ఉలవపాడు మండల పార్టీ అధ్యక్షులు రాచగర్ల సుబ్బారావు, వలేటివారిపాలెం మండల పార్టీ అధ్యక్షులు మాదాల లక్ష్మీ నరసింహం, నియోజకవర్గం తెలుగు రైతు అధ్యక్షుడు నాదెండ్ల వెంకట సుబ్బారావు, పార్టీ రాష్ట్ర కమిటీ నాయకులు షేక్ రఫీ, చదలవాడ కొండయ్య, చిలకపాటి మధు, బెజవాడ ప్రసాద్, కూనం నరేంద్ర, పార్లమెంట్ కమిటీ నాయకులు బత్తిన ఆదెమ్మ, కందుకూరు పట్టణ మహిళా కమిటీ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ముచ్చు లక్ష్మీరాజ్యం, కల్లూరి శైలజ, పట్టణ ప్రధాన కార్యదర్శి ముచ్చు శ్రీను, ఉపాధ్యక్షుడు వడ్డెళ్ళ రవిచంద్ర, గుడ్లూరు మండల తెలుగు మహిళా అధ్యక్షురాలు జొన్నలగడ్డ రమణమ్మ, నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడు పొడపాటి మహేష్, పట్టణ తెలుగు యువత అధ్యక్షుడు సవిడిపోయిన వెంకటకృష్ణ, పట్టణ బీసీ సెల్ అధ్యక్షుడు ముచ్చు వేణు, పట్టణ ఎస్సీ సెల్ అధ్యక్షుడు పులి నాగరాజు, రావి సరిత, ముప్పరాజు హారిక, అశ్విని, పొడపాటి రాధ, కంసాని మయూరి, ట్రైనర్లు యాస్మిన్, లలిత ఇంకా పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రెండు కులాల మధ్య తగాదా ఎమ్మెల్యే కు తగునా?

- శంభుని కాపులకు ఎస్సీ ధ్రువీకరణ పత్రాల జారీపై భగ్గుమన్న దళిత సంఘాలు
- బ్రిడ్జి సెంటర్ వద్ద రాస్తారోకో, ఆర్డీఓ కార్యాలయం వద్ద ధర్నా

విశాలాంధ్ర - కావలి : రెండు కులాల మధ్య ఎమ్మెల్యే తగాదా పెట్టడం తగునా? అని దళిత సంఘర్షణ సమితి జిల్లా అధ్యక్షులు ఎస్ మల్లి విమర్శించారు. శంభుని కాపులకు ఎస్సీ హోదాతో ఎస్సీ సర్టిఫికెట్లు ఇవ్వడం పై సోమవారం బ్రిడ్జి సెంటర్ వద్ద రాస్తారోకోను, ఆర్‌డిఓ కార్యాలయం వద్ద భారీ ధర్నా నిర్వహించి ఆర్‌డిఓకు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా మల్లి మాట్లాడుతూ మన జిల్లాలోని తీర ప్రాంత గ్రామాల్లో అక్కడ దక్కడ శంభుని కాపులు ఉండేవారని తెలియజేశారు. మద్రాస్ నుండి తీర ప్రాంతాలకు వచ్చి ఉన్నారని తెలియజేశారు. మన కావలి నియోజకవర్గంలో మూడు గ్రామాల్లో ఉన్నారని, వారికి గతంలో జీవో నెంబర్ 25 తీసుకుని వచ్చి ఎస్సీ సర్టిఫికెట్లు తీసుకోవడం జరిగిందని తెలియజేశారు. తద్వారా ఉద్యోగాలు కూడా పొందారని, దీనిపై హైకోర్టు సమగ్ర విచారణ జరిపించి ఆ జీవోను కొటి పారేసిందని, ఆ నియమకాలు కూడా రద్దు చేశారని తెలియజేశారు. వారిలో ఎలాంటి అంటరానితనం గాని, ఆర్థిక సామాజిక రంగాలలో ఎలాంటి వెనుకబాటి తనం లేదని, అలాంటి వారికి ఎస్సీ హోదాతో సర్టిఫికెట్ ఇవ్వటం తగదని హైకోర్టు, సుప్రీంకోర్టు కొట్టివేసిందని తెలియజేశారు. ఇటీవల రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డి తీర ప్రాంత గ్రామాలలో పర్యటిస్తూ వారికి గతంలో రద్దు చేసిన దానిని పునరుద్ధరించి వారికి సర్టిఫికెట్లు జారీ చేయడానికి అన్ని ప్రయత్నాల్లో ఉన్నారని కలెక్టర్, ఆర్డీవో తోటి మాట్లాడాలని, హైకోర్టులో కూడా పిటిషన్ వేశానని, టీవీలు ద్వారా ప్రచారం చేసి ఉన్నారని తెలియజేశారు. గతంలో కూడా ఒక శాసనసభ్యులు చేసి అబాసుపాలయ్యారని, ప్రస్తుతం రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డి దళితులు అయిన మాల మాదిగల నోరు కొట్టడం, తీర ప్రాంత గ్రామాలలో మంచి ఆర్థిక బలం ఉన్నవారికి సర్టిఫికెట్లు ఇస్తామనడం, కులం చిచ్చు పెట్టడం సరికాదని, కాబట్టి తమరు పరిశీలించాలని తెలిపారు. రాజకీయ నాయకులు ఎన్నికల ముందు ఇలాంటి జిమ్మిక్కులు చేయడం సహజమని తెలియజేశారు. కాపులకు ఎస్సీ సర్టిఫికెట్లు ఇవ్వకుండా రాజ్యాంగపరంగా, చట్టపరంగా వ్యవహరించాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సాల్మన్, గడ్డం ప్రసూనమ్మ, ప్రసాద్, సుధాకర్, కిరణ్, లక్ష్మీ నర్సు, సీనయ్య, సాయి, దానం మాల్యాద్రి, దళిత యువకులు తదితరులు పాల్గొన్నారు.